

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 । కనిష్ఠం : 23.0

డిండి వద్ద పర్యాటకుల సందడి



డిండి ప్రాజెక్టు వద్ద సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు
6

యువత రాజకీయాల్లోకి రావాలి

పాలమూరు ఎంపీ డీకే అరుణ

రేవల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాల్లోకి రావాలని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా ఏదుల మండల కేంద్రంలో నిర్వహించిన చేరికల కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 25మంది కార్యకర్తలకు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనందరి త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయ్యిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. నాలుగోసారి మోదీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పేదలకు ఉచితంగా 5కేజీల బియ్యంతో పాటు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇంటి నిర్మాణాలకు నిధులు అందజేస్తుందని తెలిపారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఏదుల గుట్టపై ఉన్న వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పద్మజారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాలమూరు ఎంపీ డీకే అరుణ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు పట్టణంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారికి మంజూరు పత్రాలు అందించారు. అదేవిధంగా మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడొద్దు, దశలవారీగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శ్రావణ్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కోడేరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

స్థానికానికి.. సన్నద్ధం



- జోరు పెంచిన ప్రధాన పార్టీల నాయకులు
- వారానికి ఐదు రోజులు నియోజకవర్గంలోనే ఎమ్మెల్యేలు
- ఈ నెల 18 నుంచి బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశాలు
- అచ్చంపేట నియోజకవర్గం చారకొండ నుంచి కార్యాచరణ
- కార్యశాల పేరిట క్షేత్ర స్థాయికి బీజేపీ

నాగర్‌కర్నూల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమరానికి ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సన్నద్ధమవుతున్నాయి. ఎన్నికల్లో సత్తాచాటి మున్ముందు మరింత బలపడడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాగా వేస్తే ఆ ప్రభావం రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఉంటుందనే భావనలో ఉన్న ఆ పార్టీలు కృషి చేస్తున్నాయి. ప్రజలకు చేరువయ్యేందుకు ఎవరీ స్థాయిలో వారు ప్రయత్నిస్తుండడంతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందుకే రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతున్న పరిస్థితి నాగర్‌కర్నూల్ జిల్లాలో కన్పిస్తోంది. అయితే ప్రధాన పార్టీలన్నీ కూడా గ్రామ, మండల స్థాయిలో ఉన్న ప్రధానమైన సమస్యలను ఇతిమిద్ధంగా చేసుకుని వాటిని పరిష్కరించడం ద్వారా బీఆర్ఎస్, బీజేపీలకు ఎన్నికల అస్త్రాలుగా మారకుండా కాంగ్రెస్ పార్టీ శతవిధాలా ప్రయత్నిస్తోంది.

వారానికి ఐదు రోజులు..

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఇందిరమ్మ ఇళ్ల, మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకాల ద్వారా రాజకీయంగా బలపడడానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో వారానికి ఐదు రోజుల పాటు అక్కడే ఉండేలా కార్యాచరణ రూపొందించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇప్పటికే నిర్మాణం పూర్తైన ఇందిరమ్మ ఇళ్లల్లో గృహ ప్రవేశం, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, గృహజ్యోతి, మహాలక్ష్మి, మహిళా సంఘాలతో సమావేశమవుతున్నారు. 20 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ నిర్దేశించిన లక్ష్యాలు ఇప్పటికీ అమలవుతున్న పథకాల గురించి ప్రచారం చేస్తూ పార్టీకి మద్దతు కూడగట్టేందుకు ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యేల పనితీరును ఇంటలిజెన్స్ వర్గాలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తున్నాయి. ఈ క్రమంలో టీపీసీసీ, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా ఎమ్మెల్యేల నియోజకవర్గ పర్యటనలకు సంబంధించి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి నివేదికలను తెప్పించుకుంటుండడం గమనార్హం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యేలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించే దిశగా అడుగులు వేస్తుండడం విశేషం. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌కు చెందిన ఎమ్మెల్యేలు దూకుడు పెంచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా నిరూపించుకునే క్రమంలో వీరు నిమగ్నమయ్యారు.

అచ్చంపేట నియోజకవర్గమే వేదికగా బీఆర్ఎస్

గడిచిన శాసన సభ ఎన్నికల్లో జిల్లాలో నాలుగు సిట్టింగ్ సీట్లను కోల్పోయిన బీఆర్ఎస్ రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందుకు అచ్చంపేట నియోజకవర్గాన్ని వేదికగా ఎంచుకుంది. ఇటీవల అచ్చంపేట నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా, విప్‌గా వ్యవహరించిన గువ్వల బాలరాజు బీజేపీలో చేరిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధిష్ఠానం అచ్చంపేట నియోజకవర్గంలో దిద్దుబాటు చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 18 నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి క్యాడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే క్రమంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి పార్టీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డి, పోకల మనోహర్‌లు పూర్తి బాధ్యతలను స్వీకరించారు. ఈ నెల 18న చారకొండ, వంగూరు, 19న పదర, అమ్రాబాద్, 21న లింగాల, బల్మూరు, 22న ఉప్పునుంతల, అచ్చంపేట, 24న అచ్చంపేట టౌన్‌లల్లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు జరగనున్నాయి.

ప్రజలకు చేరువయ్యేలా బీజేపీ..

బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు యథాశక్తిగా ప్రయత్నం చేస్తోంది. రెండు నెలల నుంచి కార్యశాల పేరిట క్రియాశీల కార్యకర్తలు దాని అనుబంధ సంఘాలకు చెందిన ప్రతినిధులు వార్డులు, గ్రామాల వారీగా వివిధ సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు చేరవయ్యే ప్రయత్నాలను చేస్తున్నారు. బీజేపీయే కాకుండా సీపీఐ, సీపీఎంలు కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నాయి. రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తూనే ప్రజల పక్షాన పోరాడేందుకు సమాయత్తమవుతున్నాయి. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాలపై ప్రధానంగా దృష్టిని సారించిన వామపక్షాలు అధికార పార్టీతో పొత్తులో భాగంగా కనీసం ఒక్కో నియోజకవర్గంలో ఐదు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

సర్కారు బడులకు సాంకేతికత

- ఆచరణ దిశగా అధికారుల అడుగులు
- ఏఐ పాఠాల అమలుకు అనుకూలం



ఉత్తనూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ బోధనను పర్యవేక్షిస్తున్న విద్యాధికారులు
7

భవనం ఒకటే.. విభాగాలే నాలుగు

విద్యుత్ శాఖలో సమన్వయం అంటే ఇదేనేమో?

- ఒకే గదిలో నాలుగు విభాగాల ఉద్యోగుల విధులు
- తికమక పడుతున్న ప్రజలు

6



సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తున్న ఏడీఈ నీలిగోవిందు

కష్టపడ్డారు అవార్డులు అందుకున్నారు



అమరచింతలో అవార్డు గ్రహీత దేవరకొండ లచ్చన్న నేత పనిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి (ఫైల్)
7

రోడ్డు ప్రమాదంలో బావ, బామ్మర్ది మృతి

- కర్ణాటకలో కారు, భారీ వాహనం ఢీ
- చీరల వ్యాపారం కోసం వెళ్లి వస్తుండగా ప్రమాదం
- మాచర్లలో అలుముకున్న విషాద ఛాయలు



రాఘవేంద్ర (ఫైల్)

గట్టు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బావ, బామ్మర్ది మృతి చెందగా.. తండ్రి, కూతురు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కర్ణాటకలోని సైదాపూర్‌లో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని మాచర్ల గ్రామానికి చెందిన పీజీ రాఘవేంద్ర (39) చీరల వ్యాపారి. చీరలు విక్రయించేందుకు రెండు రోజల క్రితం తండ్రి మాస్మన్న, తమ్ముడు ఈరన్నతో కలసి కారులో సోలాపూర్, పుణే వెళ్లారు. చీరల వ్యాపారం ముగించుకుని స్వగ్రామానికి వచ్చే క్రమంలో ఈరన్నను రైలులో వెళ్లమని సూచించారు. సోలాపూర్‌లో ఉన్న రాఘవేంద్ర బావ నాగేష్, అక్క జయంతి శ్రావణమాసం ఉత్సవాల కోసం తమ కారులో ఎక్కించుకొని తిరుగుప్రయాణం అయ్యారు. శనివారం తెల్లవారుజామున కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలోని సైదాపూర్ దగ్గర సిమెంటు లోడ్‌తో వస్తున్న భారీ వాహనం వీరు ప్రయాణిస్తున్న కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మాచర్లకు చెందిన రాఘవేంద్ర, నాగేశ్(50)లు అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి మాస్మన్న, అక్క జయంతికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాల పాలైన వీరిని రాయిచూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. వీరిద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. ఈసంఘటనపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం నాగేశ్ మృతదేహాన్ని సోలాపూర్‌కు, రాఘవేంద్ర మృతదేహాన్ని మాచర్లకు తరలించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో మాచర్లలో విషాదఛాయలు అలుముకున్నాయి.



తిరుమలయ్య గుట్టపైకి వెళ్లేదారిలో నిలిచిపోయిన వాహనాలు

తిరుమలయ్య గుట్టపై భక్తుల రద్దీ

- శ్రావణ చివరి శనివారం కావడంతో వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు

వనపర్తి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండలం పెద్దగూడెం శివారులోని తిరుమలయ్యగుట్టపై ఉన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శ్రావణ చివరి శనివారం కావడంతో జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయ సమీపంలో ఉన్న గ్రామాల నుంచి భక్తులు ఎద్దుల బండ్లపై రావడం ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. భక్తుల రద్దీతో గుట్టపైకి వెళ్లే ఎద్దుల బండ్లు, వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వేంకటేశుడి దర్శనానికి భక్తులకు దాదాపు మూడు గంటల సమయం పట్టింది. యువత కాలినడకన గుట్టపైకి వెళ్తున్న సమయంలో ప్రకృతి అందాలను చూస్తూ పరవశించిపోయారు. సెల్ఫీలు దిగుతూ ఆనందంలో మునిగితేలారు. గుట్టపైకి వచ్చిన భక్తులకు ఇబ్బంది కలుగకుండా అక్కడే అన్నదానం చేశారు.

గుట్టకు వెళ్లేందుకు ఎద్దుల బండ్లతో భక్తులు





ఆలయం వద్ద భక్తుల రద్దీ



సెల్ఫీ దిగుతున్న యువత



గెల్వలాంబ రథోత్సవంలో భక్తులు

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

వంగూరు, ఆగస్టు 16; (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు పట్టణంలో వెలసిన గెల్వలాంబ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పరిసర గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. ఎస్ఐ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బారులు తీరినా.. బస్తా అందలే



అమరచింత మండలం నాగల్‌కడుమూర్ గ్రామంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు
7

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తిటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన కల్వకోలు సత్యం మెరుగైన వైద్యం చేయించుకోవడానికి రూ. 8 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. నిరుపేదలకు వైద్యానికి సరిపోయేంత ఖర్చుకు సంబంధించి ఎల్‌వోసీ మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబ సభ్యుడికి ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ఆత్మకూరులో ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు, గ్రామస్థులు

ఆత్మకూరు/అచ్చంపేటటౌన్/ఉండవల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో యువకులు ఉట్లుకొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులను కృష్ణుడి వేషధారణ చేసి ఆనందోత్సవాల మధ్య కృష్ణాష్టమి వేడుకలు జరుపుకొన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేశవస్వామి ఆలయ సమీపంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబికాదేవి ఆలయంలో శ్రీకృష్ణుడి డోలారోహణ కార్యక్రమం నిర్వహించారు. కన్యాకపరమేశ్వరి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వృత్తాంతం, అమ్మవారికి అభిషేక్త చేశారు. గద్వాల జిల్లాలోని ఉండవల్లి మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తక్కశిల గ్రామంలో శ్రీకృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేసి పల్లకీలో ఊరేగించారు.



తక్కశిలలో శ్రీకృష్ణుడి పల్లకీ సేవలో గ్రామస్థులు



అచ్చంపేటలో చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

కలగానే కొత్త ఠాణాలు?

- నూతన మండలాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా మారని పరిస్థితి
- పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కానరాని చర్యలు
- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదన
- అత్యవసర సమయాల్లో తప్పని తిప్పలు



కోస్గి పోలీస్‌స్టేషన్

కోస్గి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన ఠాణాల ఏర్పాటు కావడం లేదు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలో మండలాల విభజన జరిగింది. నూతనంగా ఏర్పాటైన మండలాల్లో అన్ని శాఖల కార్యాలయాలు వేర్వేరుగా ఏర్పాటుచేసినా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుమాత్రం చర్యలు కనబడటం లేదు. నారాయణపేట జిల్లాలో 13 మండలాల్లో గుండుమాల్, కొత్తపల్లి కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. గుండుమాల్‌ను కోస్గి మండలం నుంచి వేరుచేసి నూతన మండలంగా ఏర్పాటు చేశారు. మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 19,932 మంది ఉండగా, 10 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తపల్లి మండలాన్ని మద్దూర్ మండలం నుంచి వేరుచేసి నూతన మండలంగా ఏర్పాటు చేశారు ఇక్కడ 19,176 జనాభా ఉండగా 10 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అప్పటినుంచి రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఎంపీడీవో ఇతర శాఖలు రెండు మండలాలకు పాత మండలాలతో సంబంధం లేకుండా వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కానీ శాంతిభద్రతల పరిరక్షణకు ఆవశ్యకత ఎంతో ఉన్నా నూతన పోలీస్‌స్టేషన్లు మాత్రం కొత్త మండలాల్లో ఏర్పాటు కాలేదు.

ఉమ్మడి మండలాలకు కలిపి ఒకే పోలీస్‌స్టేషన్

ఉమ్మడి మండలాలు మద్దూర్ కొత్తపల్లి కలిపి ఒక పోలీస్‌స్టేషన్, కోస్గి గుండుమాల్ మండలానికి కలిపి ఒకే పోలీస్‌స్టేషన్ ఉంది. కొత్తమండలాలు ఏర్పాటయ్యాక కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కానీ నేటికీ అది కలగానే మిగిలిపోయింది. ఉమ్మడి మండలాలు భౌగోళికంగా పెద్దగా ఉండటంతో ఉమ్మడి పోలీస్‌స్టేషన్ ఉండటంతో పర్యవేక్షణ కష్టంగానే ఉంది. అత్యవసర సమయాల్లో తిప్పలు తప్పడం లేదు. ఏదైన ప్రమాదం లేదా గొడవ జరిగిందని సమాచారం అందితే గుండుమల్ మండలంలోని ఏదైన గ్రామానికి కోస్గి పోలీసులు వెళ్లాలన్నా లేదా కొత్తపల్లి మండలంలో ఏదైనా గ్రామానికి మద్దూర్ పోలీసులు వెళ్లాలన్నా సుమారు 20 నిమిషాల కాలం పట్టనుంది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లే సరికి గొడవలు మితిమీరి పెద్దదవుతున్న సందర్భాలు లేకపోలేదు.

కొత్త పోలీస్‌స్టేషన్ల వ్యవహారంపై మాకేమీ సమాచారం లేదు

కొత్త పోలీస్‌స్టేషన్ల వ్యవహారంపై మాకేమి సమాచారం లేదు. ఇప్పటికీ పాత పోలీస్‌స్టేషన్లు గుండుమాల్ కోస్గి పరిధి, కొత్తపల్లి మద్దూర్ పరిధి ఎక్కడెక్కడ ఉన్నాయో అక్కడ వాటి పరిధి వరకు మాత్రమే ఉన్నాయి.

- సైదులు, సీఐ, కోస్గి

కొంత ఇబ్బందికరంగానే ఉంది

గుండుమాల్ మండలంలో కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. కానీ 100డయల్ వస్తే రాత్రిపూట కొంత ఇబ్బందికరంగానే ఉంది. గుండుమాల్ మండలంలోని సారంగరావ్‌పల్లి, సారంగరావ్‌పల్లి తండా అక్కడికి వెళ్లాలంటే కొంత సమయం పడుతుంది.

- బాల్‌రాజ్, ఎస్ఐ, కోస్గి


గొర్రెల కాపరులకు దొంగల భయం

- గొర్రెల దొంగతనం మరచిపోకముందే మూడు గ్రామాల్లోని ఇళ్లలో చోరీ
- వెన్నాచేడ్‌లో 40 గొర్రెలు, కొంరెడ్డిపల్లిలో 38 గొర్రెలు చోరీ

గండీడ్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల దొంగలతో మేకల, గొర్రెల పెంపకం దారులు బెంబేలెత్తున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని వెన్నచేడ్, కొంరెడ్డిపల్లిలో దొంగలు దాడులకు పాల్పడి మొత్తం 78 గొర్రెలను అపహరించుకపోయారు. తమ జీవనోపాధి కోసం పేద బడుగువర్గాల ప్రజలు మూగజీవాలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దీన్ని కోసం గొర్రెలను, మేకలను పెంచుతూ వాటి పాలనలో భాగంగా సుదీర్ఘ ప్రాంతాలకు వాటి మేతకోసం వెళ్లవల్సి వస్తున్నది. ఈ తరుణంలో రాత్రి సమయాల్లో కొత్త ప్రాంతాల్లో వాటిని కాపాడుకోవడం కోసం నానా ఇబ్బందికి గురవుతున్నారు. కానీ వర్షాకాలం కావడంతో సొంత గ్రామంలోనే మేత దొరకడంతో , భూస్వాములు దగ్గర కొంత భాగంలో వాటిని మందలుగా నిలుపుతారు. ఈ సమయంలో రాత్రనక పగలనక వాటిని గమనిస్తూ రాత్రి సమయాల్లో అలసిపోయి నిద్రిస్తారు. ఇలాంటి సమయంలో అదనుగా చేసుకొని దొంగల ముఠాలు మూగ జీవాలను అపహరిస్తున్నారు. జూలై 31వ తేదీ రాత్రి కొంరెడ్డిపల్లి దగ్గర 38 గొర్రెలు, ఆగస్టు 8వ తేదీన వెన్నచేడ్ గ్రామ సమీపంలో 40 గొర్రెలను అపహరించారు. రాత్రి గొర్రెలను వాహనాల్లో తరలిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో మాకు కూడా ప్రాణభయం ఉందని గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఎస్ఐ శేఖర్ రెడ్డిని వివరణ అడగగా.. ఎంక్వారీ చేయడం జరుగుతుంది.. తప్పకుండా దొంగలను పట్టుకొని గొర్రెల కాపరులకు న్యాయం చేస్తామని తెలిపారు.

ఇలాంటి దొంగతనం ఎప్పుడూ కాలేదు..



మేము చిన్నతనం నుంచి గొర్రెలను కాస్తున్నాం. కానీ ఇలాంటి దొంగతనం సంఘటనలు ఎప్పుడూ కాలేదు. గొర్రెల కాడికి పోవాలంటే భయం వేస్తుంది. దొంగలు వచ్చే సమయంలో మేము లేం. కానీ ఉంటే చంపే అవకాశాలున్నాయి. భయమేస్తుంది.

- చిలకల అంజిలయ్య వెన్నచేడ్

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

హన్వాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పల్లెమోనికాలనీ గ్రామ పంచాయతీలోని కొత్తతండాకు చెందిన రాహుల్(21) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. రెండు రోజుల క్రితం తండాకు చెందిన రాజునాయక్ దారి విషయంలో రాహుల్‌తో గొడవ పడ్డాడు. అయితే మనస్తాపానికి గురైన రాహుల్ శనివారం ఇంట్లో ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి వెంకట్ నాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవనం ఒకటే.. విభాగాలే నాలుగు

- ఒకే గదిలో నాలుగు విభాగాల ఉద్యోగుల విధులు
- తికమక పడుతున్న ప్రజలు

విద్యుత్ శాఖలో సమన్వయం అంటే ఇదేనేమో?


నాలుగు శాఖలు కొనసాగుతున్న ఒకే శిథిల భవనం


తన సహ ఉద్యోగితో కలిసి ఇరుకు గదిలో విధుల్లో ఏఈ

అయిజ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇరుకు గదిలో నాలుగు విభాగాల ఉద్యోగులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి అయిజ విద్యుత్ శాఖలో ఏర్పడింది. ఒకే కార్యాలయంలో నాలుగు విభాగాల అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో అధికారులకు ఇబ్బందులు కలగటమే కాకుండా, వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. ఆ భవనం సైతం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఒకే భవనంలోని రెండు గదులలో విధుల నిర్వహణ కొనసాగుతోంది. కస్టమర్ సర్వీసు సెంటర్‌లో ఇద్దరు ఉద్యోగులు విధులు ఈ భవనంలోనే ఉండటంతో ఎక్కడ ఏ సమాచారం అందుతుందో తెలియటం లేదు. పని నిమిత్తం వచ్చిన వినియోగదారులు అక్కడ కొనసాగుతున్న నాలుగు విభాగాల ఉద్యోగులతో తికమక పడుతున్నారు. వచ్చిన వారు అసౌకర్యానికి గురవుతున్నారు.

ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం...

ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం విధులు ఇక్కడే నిర్వహిస్తున్నది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన విద్యుత్ బిల్లుల నగదు, వినియోగదారులు తమకు కావాల్సిన విద్యుత్ వస్తు పరికరాలకు సంబంధించిన నగదు చెల్లింపులు ఇక్కడే జరుగుతున్నాయి. ఇందులో ఐదుగురు విధులు నిర్వహిస్తున్నారు.

ఏఈ కార్యాలయం

ఏఈ కార్యాలయానికి సంబంధించిన ఉద్యోగులు విధులు సైతం ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఇందులో 14 మంది ఉన్నారు. విద్యుత్ ఏఈ, ఏఈఏ, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు ఉన్నారు.

విద్యుత్ ఏడీఈ సబ్ డివిజన్ కార్యాలయం

2017 సంవత్సరంలో అయిజకు విద్యుత్ ఏడీఈ సబ్ డివిజన్ కార్యాలయం మంజూరు అయ్యింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు ప్రాంతాలకు మాత్రమే ఈ అవకాశం దక్కింది. ఒకటి కొత్తూరు కాగా మరొకటి అయిజ కావటం గమనార్హం. దీనితో అయిజ వాసులకు, అధికారులకు వ్యయప్రయాసలు తగ్గే అవకాశం ఏర్పడింది. గద్వాల రెవెన్యూ డివిజన్‌లోని అలంపూర్ తాలూకాలోని అయిజ, రాజోళి, గద్వాల తాలూకాలోని మల్దకల్, గట్టు మండలాలను ఏకం చేసి అయిజలో విద్యుత్ ఏడీఈ సబ్ డివిజన్‌ను ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చారు. జీవో 52, 10 ఫిబ్రవరి 2017న సీఎండీ టీఎస్ఎస్‌పీడీసీఎల్ నుంచి ఆదేశాలతో ఏడీఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఎలక్ట్రిసిటీ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో కొత్త మీటర్లకు గద్వాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. విద్యుత్ సమస్యలకు సంబంధించిన ప్రతీ సమస్యను ఇక్కడే పరిష్కరించుకునే వీలుంది. ఉన్నత స్థాయి అధికారులు అందుబాటులో ఉండటంతో కింది స్థాయి ఉద్యోగులు సక్రమంగా పనిచేసే వీలుంది. దీంతో విద్యుత్ వినియోగదారులకు ఉన్నత స్థాయి అధికారులు అందుబాటులో ఉండటంతో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయి.

8 సంవత్సరాలు పూర్తి అయిన కార్యాలయం ఏర్పాటు జరగలేదు. కార్యాలయం ఏర్పాటును త్వరితగతిన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడీఈ వివరణ

ఈ విషయమై అయిజ విద్యుత్ ఏడీఈ నీలి గోవింద్‌ను వివరణ కోరగా ఏడీఈ కార్యాలయం సబ్ డివిజన్ భవనం నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపటం జరిగింది. స్థలం సైతం అందుబాటులో ఉంది. నిధులు విడుదల అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

నిండుకుండలా కోయిల్‌సాగర్

- 2 గేట్ల ఎత్తివేత

దేవరకద్ర, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిండి నిండుకుండలా తలపిస్తున్నది. దీంతో ప్రాజెక్టు అధికారులు రెండు గేట్లను ఎత్తి నీటిని కిందికి వదిలారు. శనివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32 అడుగుల వద్ద నీటితో కళకళలాడుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం ఒక గేట్‌ను ఎత్తి కిందికి నీటిని విడుదల చేశారు. రాత్రి కురిసిన వర్షానికి పైభాగం నుంచి నీటిరాక పెరగడంతో శనివారం ఉదయం మరో గేటును వదిలారు. 1000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతున్నదని ఆ శాఖ ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా, 32 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి ఇంకా నీరు వచ్చి చేరితే మరికొన్ని గేట్లను తెరిచే అవకాశం ఉందన్నారు.


సంగంబండ జలాశయం 5 గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

సంగంబండ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

మక్తల్‌రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి పెద్ద వాగు వరద ఎక్కువ వస్తుండటంతో శనివారం 5 గేట్లు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 2500 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.77 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు.

ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిండి గేట్లను తెరవడంతో ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు రావడంతో ప్రాజెక్టు వద్ద సందడి నెలకొన్నది. సెల్ఫీలు దిగుతూ, ఫొటోలో తీస్తూ మరికొందరు చేపలను పట్టి ఆనందంగా గడిపారు.

డిండి వద్ద పర్యాటకుల సందడి

- పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ
- ప్రాజెక్టుల వద్ద సందర్శకుల సందడి

అచ్చంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి 765పై నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దుగా దుందుభీ నదిపై నిర్మించిన డిండి పాజెక్టుతో పాటు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దుగా నిలుస్తున్న శ్రీశైలం ప్రాజెక్టులో నీరు దిగువకు ఉరలేస్తున్నది. అక్కడి అందాలను తిలకించేందుకు శ్రీశైలం వెళ్లే భక్తులే కాకుండా పర్యాటకులు ప్రాజెక్టుల వద్ద సందడి చేస్తున్నారు. 1943 నైజాం కాలంలో దుందుభీపై 2.45 టీఎంసీల సామర్థ్యంతో డిండి ప్రాజెక్టును నిర్మించారు. ప్రస్తుతం ఎగువ నుంచి 3200 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. దీంతో అదే స్థాయిలో దిగువకు నీరు ఉరకలేస్తోంది. పర్యాటకులు మొబైల్ ఫోన్లలో కృష్ణమ్మ పరవళ్లను, జాలువారే దుందుభీ అందాలను బంధిస్తూ సెల్ఫీలతో పోటీ పడుతున్నారు. ఒక్కో దశలో ప్రమాదాన్ని కూడా లెక్కచేయకుండా ఫోటోలు దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. సందర్శకులు భారీగా తరలివస్తుండటంతో ప్రాజెక్టుల వద్ద వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ప్రయాణంలో డిండి ప్రాజెక్టు వద్ద కొద్దిసేపు ఆగి ప్రవహిస్తున్న దుందుభీని వీక్షిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకుటున్నారు. ఇదే మార్గంలో శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే భక్తులు పాతాళగంగ వద్ద ఆగి కృష్ణవేణి సోయగాలను చూసి తరిస్తున్నారు. ఎగసి పడుతున్న తుంపర్లతో ఘాట్‌రోడ్‌లలో ప్రయాణించే టూరిస్టులు సంభ్రమాశ్చర్యానికి లోనవుతున్నారు. నీటి ప్రవాహం వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.


జాలువారుతున్న డిండి ప్రాజెక్టు


డిండి ప్రాజెక్టు వద్ద ట్రాఫిక్ జామ్

శాంతించిన దుందుభీ ప్రవాహం

తాడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో ప్రవహించే దుందుభీ నది ప్రవాహం శనివారం శాంతించింది. గత రెండు రోజులుగా వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తున్న నేపథ్యంలో వరద ఉధృతి లేకపోవడం మూలంగా దుందుభీ నది ప్రవాహం తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ సిర్సవాడ వద్ద దుందుభీ నదిలో ఉన్న కాజ్‌వేపై నుంచి పారుతుండడంతో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. మొత్తంగా గత ఆరు రోజులుగా దుందుభీ నది ప్రవాహం కొనసాగుతున్నది.

పాలమూరులో మోస్తరు వర్షం

మహబూబ్‌నగర్/ నారాయణపేట/ గద్వాల/ వనపర్తి/ నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయి. శుక్రవారం రాత్రి జిల్లాలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. శనివారం వాతావరణం పొడిగా ఉన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర మండలంలో 34.3 మి.మీ., హన్వాడలో 25.6, మిడ్జిల్‌లో 19.3, కోయిలకొండలో 16.7 మహబూబ్‌నగర్ రూరల్, మూసాపేట, భూత్పూర్ మండలాలలో 14 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా కేంద్ర మండలంలో 61.3 మి.మీ., వర్షపాతం నమోదైంది. ఊట్కూర్ మండలంలో 48.3, దామరగిద్ద మండలంలో 38.0, ధన్వాడ మండలంలో 26.8, మరికల్ మండలంలో 16.0, కొత్తపల్లి మండలంలో 12.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాల్లో కూడా జల్లులు పడ్డాయి. వనపర్తి జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఇటీవలే కురుస్తున్న వర్షాలతో రైతాంగం ఉపశమనం పొందుతున్నారు. జిల్లాలో వ్యవసాయ పనులు కూడా ఊపందుకున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఘణపూర్ మండలంలో 25.2 మి. మీ, అత్యల్పంగా అమరచింతలో 0.9 మి. మీ వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సగటు వర్షపాతం 6.5 మిల్లీ మీటర్లు నమోదైంది. అత్యధికంగా ఉప్పునుంతల మండలంలో 17.2 మిల్లీ మీటర్ల వర్షం కురువగా అత్యల్పంగా తెలకపల్లిలో 1.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా పెద్దకొత్తపల్లిలో 15.2 మి.మీ., బిజినేపల్లిలో 12.8, ఉర్కొండలో 12.6, కల్వకుర్తిలో 10.4, లింగాలలో 8.6, వెల్దండలో 8.2, అచ్చంపేటలో 8.2, నాగర్‌కర్నూల్‌లో 7.8, తాడూరులో 7.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 1.4 నుంచి 6.2 మిల్లీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది.

చెర్లతిర్మలాపూర్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

కందనూలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా చెర్లతిర్మలాపూర్ వెళ్లే రోడ్డుపైకి వరద నీరు చేరడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోగా, శనివారం స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెర్లతిర్మలాపూర్ నుంచి చెర్లటిక్యాల మీదుగా నాగర్‌కర్నూల్ పట్టణానికి వచ్చే రోడ్డును మరమ్మతులు చేసి గ్రామస్థులకు రోడ్డు సదుపాయం కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

పిల్లర్ దిమ్మెలతో ఆగిపోయిన వంతెన

- అవస్థలు పడుతున్న అన్నదాతలు
- నిధులు మంజూరైనా నిర్మాణం పూర్తి కాని వంతెన
- పిల్లర్ దిమ్మెలతో ఎక్కిరిస్తున్న వంతెన
- వాగు దాటలేక ప్రమాదాలకు గురవుతున్న రైతులు


తీగలపల్లి పెద్దకొత్తపల్లి మధ్యన ఉధృతంగా ప్రవహిస్తున్న బావాయిపల్లి వాగు


నాగులపల్లి వాగులో పిల్లర్ దిమ్మెల వరకు నిలిచిన వంతెన

కోడేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో వాగుపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరై పనులు ప్రారంభించి మధ్యలో ఆపేసిన వంతెనలతో అవస్థలు పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కోడేరు మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో వాగుపై వంతెన నిర్మాణం కోసం 2 కోట్ల 10 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, కానీ కాంట్రాక్టర్ పిల్లర్ దిమ్మెల వరకు నిర్మాణం చేసి వదిలి వేశారు. బావాయిపల్లి వాగుపై వంతెన నిర్మాణం కోసం గతంలో 95 లక్షలు మంజూరయ్యాయని, ఆ తరువాత ఇదే వంతెనకు అంచనాలు మార్చి 6 కోట్ల రూపాయలు మంజూరు అయి టెండర్ పూర్తి చేసి కాంట్రాక్ట్‌కు అప్పగించారు. శిలాఫలకం వేసి ప్రారంభం చేసినా అది నేటికీ శిలాఫలకం అలాగే ఉంది. కానీ వంతెన మాత్రం పూర్తి కాలేదు. కోడేరు, పసుపుల మధ్యన పసుపుల వాగు, ఖానాపూర్, జొన్నలబొగుడ రిజర్వాయర్ మధ్యన ఖానాపూర్ వాగుపై వంతెన లేక రాకపోకలు స్తంభించి గ్రామ గ్రామానికి సంబంధాలు తెగిపోతాయి. ఏ చిన్నపాటి వర్షం వచ్చినా వాగు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ వాగులో బైకులు, ట్రాక్టర్లు, మనుషులు కొట్టుకుపోవడం జరుగుతోంది. ఇదివరకు ఖానాపూర్ వాగులో మనిషి కూడా చనిపోవడం జరిగింది. ప్రజాప్రతినిధులను, అధికారులను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే వాగులపై వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్నారు. వాగులు వచ్చినప్పుడు రెవెన్యూ అధికారులు, పోలీసులు పహరా కాస్తూ ఉంటారు కానీ వంతెన నిర్మాణాలు మాత్రం పూర్తి కావడం లేదు.

వంతెన నిర్మాణం చేపట్టండి



అచ్చంపేట వయా పెద్దకొత్తపల్లి, వనపర్తి ప్రధాన రహదారి ఈ రోడ్డుపై బావాయిపల్లి వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో ట్రాక్టర్లు పెద్ద వాహనం ట్రాలీ కూడా వరదలకు కొట్టుకుపోయిన సంఘటనలు ఉన్నాయి. అవేకాక ట్రాక్టర్లు, బైకులు, మనుషులు వరద ఉధృతికి కొట్టుకుపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. వనపర్తి నుంచి అచ్చంపేట వెళ్లాలంటే ఈ దారిపై సుమారు 25,30 కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట వెళ్లే ప్రయాణికులు ఈ రోడ్డుపై ఎక్కువగా వెళ్తూ ఉంటారు. ఈ వాగుపై వంతెన నిర్మాణం ఎంతో అవసరం. ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు హామీ ఇవ్వడం మరిచిపోవడం జరుగుతూ ఉంది. ఇప్పటికైనా వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

- నాగన్న బావాయిపల్లి

కందనూలు నుంచి కోడేరుకు రాకపోకలు బంద్

కోడేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం నుంచి మండలానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పేరుకు మాత్రమే మండలం కానీ అభివృద్ధిలో మాత్రం శూన్యం. అన్ని మండలాల కన్నా వెనుకబడింది కోడేరు మండలం. ఏ కొద్దిపాటి చినుకులు పడినా రోడ్డు మొత్తం చిత్తడి చిత్తడిగా ఉండి రాకపోకలు నిలిచిపోతున్నాయి. గ్రామాల నుంచి మండలానికి మండలం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే తలప్రాణం తోకకు వస్తుందని మండల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలం నుంచి ఎటు వెళ్లాలన్న వాగులు దాటి వెళ్లాల్సిందేనని, వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టకపోవడంతో వర్షాలు వచ్చిన సమయంలో రోజుల కొద్ది మండలానికి గ్రామాలకు రవాణా స్తంభించి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. కోడేరు మండలం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఏదుల రిజర్వాయర్ కట్టపై తీగలపల్లి నుంచి నాగాపూర్ వరకు మట్టి రోడ్డు, వర్షాలకు గుంతలు పడి ద్విచక్ర వాహనాలు, బస్సులు నడవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడితే 10, 15 రోజుల రవాణా పూర్తిగా స్తంభిస్తుందన్నారు. తీగలపల్లి కట్టపై బీటీ రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు వేసి కాంట్రాక్టర్‌కు అప్పగించిన పనులు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లా కేంద్రానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


ఇప్పలపల్లి అంజిలయ్య (ఫైల్)

తిమ్మాజిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన ఇప్పలపల్లి అంజిలయ్య(68)అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గత కొన్నాళ్లుగా కంటి చూపు తగ్గిపోవడం అంజిలయ్య రోజు మాదిరిగానే శనివారం పొద్దున్నే 5గంటల సమయంలో కావేరమ్మ చెరువు కట్ట ప్రాంతానికి బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కింద పడిపోయాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అటుగా వెళ్తూ కింద పడిపోయిన అంజిలయ్యను గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. మృతుడి చిన్న కుమారుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసే విచరాణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య బచ్చమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మురికి కాల్వలో పడి కార్మికుడు..

వనపర్తి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మురికి కాల్వలో పడి గ్రామ కార్మికుడు మృతి చెందిన సంఘటన వనపర్తి మండల పరిధిలోని అంకూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన రాములు (40) గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా ఉండే డ్రైనేజీల్లో చెత్తా చెదారాన్ని తీసేందుకు వెళ్లాడు. మురికి కాల్వను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కాలువలో పడ్డాడు. ప్రమాదంలో రాములుకు ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

జడ్చర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహబబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో వరద నీటిలో గల్లంతయిన యువకుడి మృతదేహం శనివారం ఉదయం లభ్యమయ్యింది. జడ్చర్ల మండలం బోయిలకుంట్లకు చెందిన భాను(24) తన స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం వరద నీటిలో చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. వరద నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. జడ్చర్ల ఫైర్‌స్టేషన్ అధికారులు గత రెండు రోజులుగా భాను కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆసుపత్రికి సుమారు వంద మీటర్ల దూరంలో మృతదేహం లభ్యమయ్యింది.

యువతి అదృశ్యం

రాజాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి శుక్రవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన యువతి సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో యువతి తండ్రి రంగారెడ్డి జిల్లా కేశంపేట తండాకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కిరాణ దుకాణంలో చోరీ


వెంకటాపూర్ గ్రామంలో చోరీకి గురైన కిరాణం షాపు

అయిజ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని కిరాణం దుకాణంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన చరణ్ శుక్రవారం రాత్రి తన కిరాణం దుకాణానికి తాళం వేసుకుని ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం షాపునకు వెళ్లాడు. అక్కడ ఉన్న తాళం పగలగొట్టి ఉండ టాన్ని గమనించాడు. వెళ్లి చూస్తే రూ. 15 వేల విలువ గల నిత్యావసర స రకులు, పెట్రోల్ నిల్వ ఉంచిన డబ్బాను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపా రు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

కష్టపడ్డారు.. అవార్డులు అందుకున్నారు

ఒకప్పుడు చేనేత వృత్తిలో దుర్భర పరిస్థితి ఎదుర్కొన్న కార్మికులు ప్రస్తుతం ఆ వృత్తిపై పెరుగుతున్న ఆదరణ.. ప్రభుత్వ ప్రోత్సాహంతో రెట్టింపు ఉత్సాహంతో నేత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. అప్పట్లో రాష్ట్రంలో ఒకవైపు మాస్టర్ వీవర్స్ పెరిగి శ్రమ దోపిడీ.. మరోవైపు వృత్తిలో గిట్టుబాటు ధర లేక వలస వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. నేడు అదే కార్మికులు నేత పనిలో తమ నైపుణ్యాన్ని పెంచుకొని పోగొట్టుకున్న ప్రదేశంలోనే వెతుక్కున్న చందంగా ఆ వృత్తిలో రాణిస్తుండటం గమనార్హం.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి అవార్డు అందుకుంటున్న దేవరకొండ లచ్చన్న


గత ఏడాది రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న అమరచింత నేత కార్మికులు

- నేత పనిలో రాణిస్తున్న కార్మికులు
- ప్రతీ ఏటా రాష్ట్ర అవార్డుకు అమరచింత చేనేత కార్మికులు

అమరచింత, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చేనేత పనిలో రాటుదేలుతున్న నేత కార్మికులు దిన దినం వృత్తి నైపుణ్యాన్ని పదును పెడుతూ వస్తున్నారు. మారుతున్న కాలానికి అనుకూలంగా చేనేత వృత్తిపై మగువల మనసు దోచుకునే విధంగా నూతన డిజైన్లను రూపొందించి కొత్త కొత్త పట్టు చీరలను తయారు చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం అమరచింత చేనేత కార్మికులు రాష్ట్ర స్థాయిలో రాణించి అవార్డులు కైవసం చేసుకుంటున్నారు. ఈ సంవత్సరం రాష్ట్ర చేనేత జౌళి శాఖ వారు రాష్ట్రస్థాయిలో కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు వనపర్తి జిల్లాలో నలుగురిని ఎంపిక చేశారు. అందులో అమరచింతకు చెందిన ఇద్దరు నేత కార్మికులు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన దేవరకొండ లచ్చన్న సైడ్ లోన్ సిల్క్ పట్టు సారీ ప్రత్యేక డిజైన్‌లో రూపొంది అవార్డుకి ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన మహంకాళి సులోచన అమేళా బీర్ బూటా బార్డర్‌తో పట్టు శారీ నేసి పురస్కారానికి ఎంపికయ్యారు. గత ఏడాది పట్టణానికి చెందిన గాజుల వెంకటేష్ 480 పన్నుల కొంగు చీరను నేసి అవార్డు తీసుకోగా, అదే ఏడాది పట్టణానికి చెందిన చిన్న సీతారాములు కంచికోటమ్మ టర్నింగ్ పట్టు చీర నేసి అవార్డు తీసుకున్నారు.


రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైన పట్టు చీరతో అవార్డు గ్రహీత సులోచన

ఇదిలా ఉండగా అమరచింత చేనేత సహకార సంఘం పరిధిలో ఉన్న తిప్పడంపల్లి గ్రామానికి చెందిన షీలా బుడ్డన్న కొమ్మ బూటా సైడ్ డిజైన్‌తో పట్టు చీర నేసి ఈ ఏడాది అవార్డుకు ఎంపికయ్యారు.

అలాగే, గత ఏడాది అదే గ్రామం నుంచి సత్యన్న కోటకొమ్మల పట్టు చీర యంత్ర సాయం లేకుండా పూర్తిగా చేతితో నేసి రాష్ట్ర స్థాయిలో అవార్డు తీసుకున్నాడు. ఇలా ప్రతీ సంవత్సరం రాష్ట్ర స్థాయి పురస్కారాలకు అమరచింత చేనేత కార్మికులు ఎంపికవుతూ.. రాణిస్తుండటంతో పలువురు అభినందిస్తున్నారు.

ఎంపిక విధానం ఎలా...

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే చేనేత కార్మికుల రాష్ట్ర అవార్డుల్లో అత్యంత పారదర్శకంగా తీసుకుంటారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన కార్మికులను కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందజేస్తారు.

ఇందులో భాగంగా చేనేత కళాకారులు డిజైనింగ్ వృత్తిలో నైపుణ్యం కలిగిన వారి నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ వారు దరఖాస్తు లను ఆహ్వానిస్తారు.

నేత కార్మికుల దరఖాస్తులను పరిశీలించి రాష్ట్ర స్థాయిలో డిజైనింగ్ , వీవింగ్ రెండు కేటగిరిలో అత్యంత ప్రతిభ కలిగిన కార్మికులను రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేస్తారు.

ఎంపికైన నేత కార్మికులను ప్రతీ ఏడాది ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి, చేనేత జౌళి శాఖ మంత్రి చేతుల మీదుగా కార్మికులను సత్కరించి అవార్డుతో పాటు 25వేల చెక్కును అందజేస్తారు.

అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది



అనేక సంవత్సరాలుగా చేనేత వృత్తిని నమ్ముకొని ముందుకు వెళ్తున్న 90 ఏళ్ల వయసులో ఇంకా చేనేత పనిలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల తమ లాంటి సీనియర్ నేత కార్మికులతో పాటు చేనేత వృత్తిని నమ్ముకున్న వారందరికీ ఎంతగానో నూతన ఉత్సాహం కలుగుతుంది.

- దేవరకొండ లచ్చన్న, అవార్డు గ్రహీత, అమరచింత

నేత పనిలో నైపుణ్యాన్ని పెంచుకోవాలి



చేనేత కార్మికులు నమ్ముకున్న వృత్తిలో కళా నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నారు. నేత కార్మికులు ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిభ కలిగిన కార్మికులను ప్రభుత్వం పారదర్శకంగా గుర్తించి ప్రోత్సహిస్తున్నది.

- గోవిందయ్య, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు

పల్లా నారాయణశర్మ మరణం తీరని లోటు


కవి పల్లా నారాయణ శర్మ (ఫైల్)

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తికి చెందిన ప్రముఖ కవి పండితుడు కవిచంద్ర పల్లా నారాయణశర్మ (98) మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా జిల్లా విద్యాశాఖలో తెలుగు భాషోపాధ్యాయులుగా పని చేసిన ఆయన సంస్కృతాంధ్ర భాషల్లో గొప్ప పండితుడిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఎన్నో సాహిత్య సమావేశాలలో అవధానాలలో పాల్గొని సత్కారాలను అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత పల్ల అని కొనియాడారు. కళాభ్యుదయం, భద్రగిరి శతకం, రంగనాయక్ సుప్రభాతం, కేతేపల్లి ఆంజనేయ రామచంద్ర శతకం మొదలైనవి పల్లా నారాయణశర్మ రచనలని గుర్తు చేశారు. ఆయన మరణం పట్ల సాహితీవేత్తలు కందూరు నారాయణ రెడ్డి, సందాపురం బిచ్చయ్య, ఆకుల శివరాజలింగం, కొత్తకాపు నారాయణరెడ్డి, జనజ్వాల భైరోజు చంద్ర శేఖర్, డాక్టర్ బి. శ్యాంసుందర్, బండారు శ్రీనివాస్ డాక్టర్ తూర్పింటి నరేష్ కుమార్, ఉప్పరి తిరుమలేశ్, బొజ్జిబాబు తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మా ఊరికి బీటీ రోడ్డు వేయాలి

కొత్తపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌నగర్ గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. కొన్నేళ్ల క్రితం నుంచి గ్రామ రహదారి బాగును ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇరువైపులా కంపచెట్లు మొలవడంతో రోడ్డు కన్పించకుండా పోయిందని పేర్కొన్నారు. దీంతో తాము భూనీడు వీధుల గుండా భూనీడు బస్టాండ్‌కు వెళ్లి ప్రయాణాలు కొనసాగిస్తున్నామని, గ్రామం నుంచి పేట రోడ్డుపైకి వచ్చి బస్సెక్కాల్సి వస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని రహదారులను బీటీగా మారుస్తున్న అధికారులు తమ గ్రామంలో కూడా బీటీ వేసి రహదారిని బాగు చేయాలని గ్రామస్థులు పోలీస్ ముకుంద, కుమ్మరి గణేష్, రాఘవేందర్ రెడ్డి తదితరులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


కిషన్‌నగర్ గ్రామానికి బీటీ వేయాలని కోరుతున్న గ్రామస్థులు

మాకు న్యాయం చేయాలి

- ప్లకార్డులతో విద్యార్థుల ఆందోళన


న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఆందోళన తెలుపుతున్న విద్యార్థులు

దామరగిద్ద, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోతున్న మాకు, మా గ్రామ రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామ పంచాయతీ ముందు ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేశారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, భూముల బేసిక్ ధరను నిర్ణయించేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. పై విషయాలపై ప్రభుత్వం స్పందించి రైతులకు మా తల్లిదండ్రులకు, మాకు న్యాయం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

- కొల్లాపూర్ ముదిరాజ్ సంఘం నాయకుల విన్నపం


రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కలిసిన కొల్లాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు

కొల్లాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ ముదిరాజ్ కమ్యూనిటీ సంఘం నాయకులు శనివారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కలిసి తమ సమస్యలను లిఖిత పూర్వకంగా వివరించారు. కొల్లాపూర్ పట్టణంలోని సురభి రాజాబంగ్లా దక్షిణ భాగంలో నిర్మిస్తున్న కొల్లాపూర్ ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణంపై ఎదురవుతున్న సమస్యలను ముదిరాజ్ కమ్యూనిటీ సంఘం కొల్లాపూర్ అధ్యక్షుడు జూపల్లి నాగేంద్రం గౌరవ అధ్యక్షుడు భయ్యా వెంకటస్వామిలు వారికి క్లుప్తంగా వివరించారు. గతంలో మునిసిపల్ కమిషనర్‌గా పని చేసిన అధికారి ముదిరాజ్ భవనంపై ఇచ్చిన తప్పుడు ప్రొసీడింగ్ విషయంపై పూర్తిస్థాయి వివరాలతో డాక్యుమెంట్లతో అందజేశారు. ఈ విషయాలపై వారు సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు. కొల్లాపూర్ ముదిరాజ్ భవన్ నిర్మాణానికి ఎల్లప్పుడు తమ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారని ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఒక బీసీ నాయకునిగా బీసీ కమ్యూనిటీ భవనంపై, బీసీలపై జరిగిన ఈ అన్యాయాన్ని తప్పనిసరిగా సరి చేసేందుకు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నట్లు తెలియజే శారు. వారిని కలిసిన వారిలో రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి పగిడాల సుధాకర్, కొల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జూపల్లి నాగేంద్రం, గౌరవ అధ్యక్షుడు బయ్యా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ముదిరాజ్, సీనియర్ నాయకుడు ఎస్ఎన్ రాజు తదితరులు ఉన్నారు.

బారులు తీరినా.. బస్తా అందలే..


అమరచింతలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

- యూరియా కోసం రైతన్న అగచాట్లు

అమరచింత, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతన్నకు అగచాట్లు తప్పడం లేదు. రాత్రనక.. పగలనక.. బారులు తీరినా.. ఒక బస్తా యూరియా కూడా అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. యూరియా కోసం రైతులు శనివారం పెద్ద సంఖ్యలో అమరచింత మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాల ముందు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆగ్రో రైతు సేవ కేంద్రంతో పాటు నాగల్ కడుమూరు గ్రామంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం వద్ద ఉదయం ఆరు గంటల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో చేరి క్యూ లైన్‌లో నిలబడ్డారు. మధ్య రాత్రి రెండు ఆగ్రో కేంద్రాల వద్ద యూరియా స్టాక్ వచ్చిందని తెలుసుకున్న రైతులు పాస్ పుస్తకాలతో భారీగా వచ్చారు. దీంతో ఫర్టిలైజర్ యజమానులు మాత్రం ఒక పట్టా పాస్ పుస్తకానికి రెండు యూరియా బస్తాలు మాత్రమే అందించారు. క్యూ లైన్‌లో నిలబడ్డ చాలా మంది రైతులకు చివరి వరకు యూరియా అందలేదు. స్టాక్ అయిపోయిన వెంటనే రైతులు వెనుతిరిగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

ఏది ఏమైనా అధికారుల పర్యవేక్షణ లోపంతో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

స్పోర్ట్స్ స్కూల్‌కి విద్యార్థిని ఎంపిక

దామరగిద్ద, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని జీపీఎస్ పాఠశాలకు చెందిన కావలి అక్షయ 4వ తరగతికి గాను కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అక్షయ స్పోర్ట్స్ స్కూల్‌కి ఎంపిక పట్ల సన్మానించి అభినందించారు. అక్షయకు బ్యాగు, బూట్లు, అందించారు. పీటీ రమణ, ఉపాధ్యాయుడు నాగేందర్ పాల్గొన్నారు.


కావలి అక్షయను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సర్కార్ బడులకు సాంకేతికత

- ఆచరణ దిశగా అధికారుల అడుగులు
- ఏఐ పాఠాల అమలుకు అనుకూలం




చిన్నతాండ్రపాడులో ఏఐ పాఠాలు వింటున్న విద్యార్థులు

అయిజ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సర్కార్ బడులకు సాంకేతికత చేకూరనుంది. దీంతో ఏఐ(కృత్రిమ మేధా) పాఠాలతో పాటు, విద్యార్థుల వివరాలు, పాఠశాల సంబంధిత అంశాలను సైతం ఆయా పాఠశాలల నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 280 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలకు బీఎస్ఎన్ఎల్ ద్వారా ఉచిత ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించనున్నారు. ఈ మేరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు కనెక్షన్‌లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు సంబంధిత బీఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అవసరమైన మేరకు వివరాలు సేకరించే పనుల్లో అధికారులు నిమగ్నమై ఉన్నారు.

లాభం చేకూరుతుంది ఇలా...

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉచిత ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తే ఉపాధ్యాయులు, విద్యార్థులకు మేలు చేకూరనుంది. ఇప్పటికే పాఠశాల ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు, పాఠశాలకు కంప్యూటర్లు అందచేశారు ఇంటర్‌నెట్ సౌకర్యం లేని కారణంగా వాటిని ఉపయోగంలోకి తీసుకురాలేకపోతున్నారు. ప్రస్తుతం ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తే వాటి ఉపయోగం ఉపాధ్యాయులు, విద్యార్థులకు చేకూరనుంది. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు సైతం అందులో నమోదు చేసే వీలుంది. ప్రగతి నివేదికలు, పాఠశాల వివరాలు ఆన్‌లైన్‌లో పంపేందుకు ప్రస్తుతం ఉపాధ్యాయులు ఇంటర్‌నెట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డులకు ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌లోని హాట్‌స్పాట్ వైఫై కనెక్షన్ ఇచ్చి ప్యానెల్‌కు నెట్ సౌకర్యం కల్పించుకుని విద్యాబోధన సాగిస్తున్నారు. పాఠశాలలకు నెట్ సౌకర్యం కల్పిస్తే ఈ సమస్యలు తీరి విద్యాభివృద్ధికి ఉపయోగపడే వీలుంది. వేగవంతమైన ఆధునిక సాంకేతికత బోధన అందటంతో పాటు అవసరమైన సమాచార సేకరణతో పాటు సరఫరా సైతం స్పీడందుకుని చురుకుగా విద్యాబోధన సాగుతుంది. ఆ దిశగా అధికారులు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పనకు పనులు వేగవంతం చేయాల్సిందిగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి

ప్రభుత్వ బీఎస్ఎన్ఎల్ కంపెనీ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించనున్నారు. ఈ మేరకు సమాచారం అందింది. దీనితో పాఠశాలలకు ఇంటర్‌నెట్ అవస్థలు తప్పనున్నాయి. ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. బీఎస్ఎన్ఎల్ అధికారులు పాఠశాలల వివరాలు సేకరించారు. పాఠశాలలను పరిశీలించటం కూడా జరిగినది. ఆ దిశగా పనులు త్వరలో ప్రారంభించనున్నారు.

- శాంతిరాజు, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి

న్యూస్ బాక్స్

నష్టపరిహారం చెల్లించాలి

ఆత్మకూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ముంపునకు గురైన వరి పంటలను తక్షణమే గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు శనివారం రాబర్ట్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు రోజుల నుంచి ఆత్మకూరు మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, దీంతో మూలమల్ల, ఖానాపూర్, రేచింతల, కత్తెపల్లి గ్రామాల్లో వరి పంటలు ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ అధికారులు పంటలను గుర్తించే కార్యక్రమం చేపట్టలేదని, తక్షణమే ఆయా గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురైన పంటలను గుర్తించి నష్టపరిహారం చెల్లించేలా చూడాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా భరత్ భూషణ్



కొత్తకోట ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ భరత్ భూషణ్ బీజేపీ పాలమూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. శనివారం ఆ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించిన కార్యవర్గంలో చోటు లభించడం జరిగిందని భరత్ భూషణ్ తెలిపారు. నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలకు పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

గిరిజనులను అవమానించిన నాయకులపై చర్యలు తీసుకోవాలి

రేవల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గిరిజన లంబాడి జాతిని కించపరిచేలా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి వ్యవహరించారని గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు తిరుపతి నాయక్ ఆరోపించారు. ఏదుల మండల కేంద్రంలో శనివారం చేరికల కార్యక్రమం బీజేపీ తరఫున నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన బిడ్డలు అయిన మమ్మల్ని రేవల్లి బీజేపీ మండల అధ్యక్షుడు బాలునాయక్ రాష్ట్ర నాయకులు తిరుపతినాయక్ సమాచారం ఇవ్వకుండా నిర్వహించారన్నారు. కార్యక్రమానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ పాల్గొన్నారని అన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎవ్వరికి అధ్యక్షులకు సమాచారం లేకుండా కార్యక్రమాలు నిర్వహించి, మమ్మల్ని అవమానపరిచారని అన్నారు. మాజీ జడ్పీటీసీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, రాష్ట్ర బీజేపీ కమిటీ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సతీష్ యాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యునైటెడ్ నేషన్ ఐపీయూజే యూనివర్సిటీ ప్రతినిధులు

వనపర్తి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం పాండిచ్చేరిలో గ్లోబల్ అక్రిడేషన్ యునైటెడ్ నేషన్, నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ డాక్టరేట్ పట్టా పొందాడు. 25 సంవత్సరాలుగా సమాజ సేవకు, ప్రజా సమస్యలపై నిరంతరాయంగా 18 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటానికి గుర్తుగా యునైటెడ్ నేషన్ ఐపీయూజే యూనివర్సిటీ ప్రతినిధులు సతీష్ యాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసి ఘనంగా సన్మానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి డాక్టరేట్ ప్రదానం చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి తనకు డాక్టరేట్ ప్రదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డాక్టరేట్‌తో పాటు తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

పాన్‌గల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బండపల్లి గ్రామానికి చెందిన వెంకటపతి నాయుడుకి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరసాగర్ ఆధ్వర్యంలో చెక్కు అందజేశారు. వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయక్, రవికుమార్, జ్యోతి నందన్‌రెడ్డి, సుదర్శన్ నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనంలో గుడ్డు ఏదీ?

వనపర్తి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం తండా, క్రిష్టగిరి, సవాయిగూడెం, తదితర గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు పెట్టడంలేదు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మెరుగుపడేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కానీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయకపోవడంతో అక్కడక్కడ కొన్ని పాఠశాలలో విద్యార్థులు పౌష్టికాహార భోజనానికి దూరమైనట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయం తమ దృష్టికి రాలేదు. వారానికి మూడు సార్లు గుడ్డు పెట్టేలా చూస్తామని ఎంఈఓ మద్దిలేటి తెలిపారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వరు.. రోడ్డు పనులు చేయరు

- రోడ్డు విస్తరణలో గూడు కోల్పోయిన బాధితుల ఆవేదన
- పట్టించుకోని అధికారులు, నాయకులు



ఇళ్లను కూల్చి రోడ్డు పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారిన స్థలం

పెబ్బేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ అభివృద్ధి, ప్రజల సౌలభ్యం కోసం రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయారు. బాధితుల కోరిక మేరకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తాం, లేదా ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలాలు కేటాయిస్తామని మూడేళ్ల కిందట అప్పటి అధికారులు, పాలకులు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో జాప్యం జరుగుతుంది. పట్టణ అభివృద్ధి కోసం, భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని కొందరు స్వచ్ఛందంగా, మరికొందరు ఇచ్చిన హామీలను నమ్మి ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న తమ ఇళ్లు తొలగించుకునేందుకు అంగీకరించారు. ఇళ్ల పట్టాలు ఇస్తారనే ఆశతో నేటికీ నిరీక్షిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ ఐదుగురు మునిసిపల్ కమిషనర్లు మారినా.. పనుల్లో పురోగతి కనిపించడం లేదు. గూడు కోల్పోయిన చాలా మంది బాధితులు దుర్భర పరిస్థితిలో జీవిస్తున్నారు. సుభాష్ చంద్రబోస్ చౌరస్తా నుంచి వనపర్తికి వెళ్లే రోడ్డు మార్గం అంబేడ్కర్ నగర్ కాలనీ వద్ద ఉన్న జూరాల కాలువ వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇరువైపుల ఇళ్లు కోల్పోయిన 149 మంది బాధితులు గోసగా కాలం వెళ్లదీస్తూ ఎన్నాళ్లీ దుర్భర పరిస్థితితో బతుకుదెరువును కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముగింపు ఎన్నడు..?

రోడ్డు విస్తరణలో భాగంగా నాలుగు లైన్ల బీటీ రోడ్డు నిర్మాణం, రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ. 3కోట్ల 80లక్షలు, విద్యుత్తు నూతన స్తంభాల ఏర్పాటు కోసం కలెక్టర్, మునిసిపాలిటీ నిధుల నుంచి రూ25 లక్షలతో పనులు చేపట్టేందుకు 2024 డిసెంబరులో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు ఒక వైపు బీటీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను జనవరిలో పూర్తి చేశారు. పాత విద్యుత్తు స్తంభాలను తొలగించి వాటి స్థానంలో నూతన విద్యుత్తు స్తంభాలు పాతారు. పాతిన విద్యుత్తు స్తంభాలకు విద్యుత్తు వైర్లు, సామగ్రిని అమర్చకుండా వదిలేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు బీటీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి చేశారు.. మరోవైపు పనులు నిలిచిపోవడంతో రోడ్డుపై తరుచుగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టాలు ఇచ్చి పనులు ప్రారంభించాలి..

పాలకులు, అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ముందుగా ఇళ్ల పట్టాలు ఇవ్వండి మా ఇళ్లను మేమే స్వచ్ఛందంగా తొలగించుకుంటాము ఆ తర్వాతనే పనులు ప్రారంభించండంటూ కొందరు యజమానులు చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఇళ్లు తొలగించిన స్థలాల్లో వర్షాలకు వర్షపు నీరు, మరో పక్క మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తుందని పలుమార్లు మునిసిపల్ అధికారులకు చెప్పిన ఫలితం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలల కిందట విషయాన్ని కొంత మంది బాధుతులు కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. జూన్ నెలలో కలెక్టర్ ఆదేశాలతో అప్పటి కమిషనర్ అశోక్ రెడ్డి ఆగమేఘాలతో యంత్రాలతో పోలీసు స్టేషన్ పక్కల ఉన్న దాదాపుగా ఏడు దుకాణాలను కూల్చి వదిలేశారు. తొలగించిన ఇళ్ల ఖాళీ స్థలాల్లో మురుగు చేరుకొని దుర్వాసన వస్తుందని బాధితులు వాపోతున్నారు.

ఇళ్లు తొలగించని వారికి నోటీసులు



రోడ్డు విస్తరణలో ఇళ్లు తొలగించని ముగ్గురి యజమానులకు నోటీసులు ఇచ్చాం. త్వరలో వాటిని తొలగించి పనులు చేపడుతాం. జూరాల కాలువ ఇరువైపుల ఉన్న భూమిని సర్వే చేస్తున్నారు. త్వరలోనే ఇళ్ల పట్టాలు అందజేసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం.

- ఖాజా ఆరీఫ్‌ద్దీన్, కమిషనర్, పెబ్బేరు మునిసిపాలిటీ

రోడ్డు మరమ్మతులు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు



రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మారెమ్మకుంట మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని మారెమ్మకుంట వద్ద ప్రమాదభరితంగా ఉన్న రోడ్డును బాగు చేయాలని సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దళితవాడకు వెళ్లే మారెమ్మకుంట రోడ్డు మలుపు వద్ద 5 ఫీట్ల లోతు ఉందని, టర్నింగ్ పాయింట్ కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆదివారం సంత జరుగుతుందని, ఆ రోజు మరీ ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. రోడ్డును ఆక్రమించుకుని మాంసం, చేపల వ్యాపారాలు చేస్తున్నారని, దీంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దళితవాడకు వెళ్లే దారిపై అధికారులు, పాలకులు వివక్ష వీడాలని, లేకుంటే దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. పరమేశ్వరాచారి, కురుమయ్య, గంధం గట్టయ్య, మదన్, బాల స్వామి, బీసన్న, రమేష్, రాబర్ట్, బారాజు, పుల్లయ్య పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

చిన్నంబావి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో శనివారం వివిధ పార్టీల నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రమష్, పెద్ద మల్లయ్య, బీజేపీ నాయకులు చిన్నమల్లయ్య, కృష్ణ, అంబేడ్కర్ యువజన సంఘం కృష్ణ రమాకాంత్, రామచందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ మతోన్మాద రాజకీయం



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

పాన్‌గల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ దేశంలో హిందూ మతోన్మాద రాజకీయాలను ప్రేరేపిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు గిట్టుబాటు ధర కోసం, కార్మికులు కనీస వేతనం కోసం, నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి కోసం తపిస్తున్నారని, వాటిని బీజేపీ పరిష్కరించడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ప్రజా సమస్యల నుంచి ప్రజలదృష్టి మళ్లించేందుకు హిందూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తుందన్నారు. కార్యక్రమంలో కళావతమ్మ, రమేష్, సీనియర్ నాయకులు కాకం కాశన్న, కురువ హనుమంతు, చిన్న కుర్మయ్య, కాకం రాముడు తదితరులు పాల్గొన్నారు.

మహాగర్జన సభను జయప్రదం చేయాలి

- వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల మహా గర్జన సభను జయప్రదం చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాగర్జన సభ సెప్టెంబరు 9న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగనుందని, ఈ మహా గర్జన సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు చెన్నకేశవులు, గంధం గట్టయ్య మాదిగ, లక్ష్మయ్య, కృష్ణయ్య, శ్రీనివాసులు, కుమార్, శేఖర్, కృష్ణవేణి, తిరుపతి, పరశురాముడు, రమేష్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

అమరచింత, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మస్తీపురం క్రాస్ రోడ్ వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు కోసం అనుమతి ఇవ్వాలని మంత్రి వాకిటి శ్రీహరిని శనివారం విగ్రహ కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రిని కలిసి క్రాస్ రోడ్ ప్రధాన రహదారి పక్కన సర్కిల్లో సహకరించాలని కోరగా వెంటనే స్పందించిన మంత్రి విగ్రహ ఏర్పాటు చేసుకోవడానికి అన్ని అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో కమిటీ సభ్యులు సురేష్, దేవరకొండ మోహన్, పాండు, క్యామ్ భరత్, తెలుగు, తిరులమలేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు



సంగినేనిపల్లి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో..

ఖిల్లాగణపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం చివరి శనివారంను పురస్కరించుకొని భక్తులు భక్తిశ్రద్ధలతో మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బెస్తగేరి ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు అఖండ భజనలతో ఉత్సవ విగ్రహానికి పల్లకి సేవ నిర్వహించారు. ఆలయంలో హనుమాన్ నామస్మరణ మార్మోగింది. శ్రావణ మాసం సందర్భంగా మహిళలు దేవాలయాల్లో ప్రదక్షిణలు చేసి ఇష్ట దైవాలకు నైవేద్యాలు సమర్పించారు. పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొత్తకోట : మండలంలోని ముమ్మళపల్లి, పామాపురం, మిరాసిపల్లి, నాటవెల్లి, విలియంకొండ, సంకిరెడ్డిపల్లి, రాయనిపేట, పాలెం, నిర్వేన్ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలను భక్తులు చేయించారు. ఆంజనేయస్వామి విగ్రహాలకు అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించి గ్రామ వీధుల్లో భజనలు చేస్తూ ఊరేగించారు. ఆలయాల అభివృద్ధి కమిటీ నాయకులు అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు.

వీపనగండ్ల : మండలంలో శ్రావణ శనివారం సందర్భంగా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీపనగండ్ల, కల్వరాల, తూముకుంట, గోవర్ధనగిరి ఆలయాల్లోను సంగినేనిపల్లి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో వందలాదిగా భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.



ఖిల్లాగణపురం బెస్త గేరి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ పల్లకీ సేవ



కొత్తకోట మండలం, ముమ్మళ్లపల్లి గ్రామంలో పూజలకు హాజరైన మహిళలు

ఘనంగా కృష్ణాష్టమి

- ఉత్సాహంగా ఉట్ల పండుగ

ఖిల్లాగణపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్లు కొడుతూ సంబరాలు చేశారు. మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, అఖండ భజన మధ్య ఊరేగింపు నిర్వహించి వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ఉట్ల మండపంలో ఉత్సాహంగా ఉట్లు కొడుతూ సందడి చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

చిన్నంబావి : మండల పరిధిలోని బెక్కెం, కొప్పునూర్‌లో శనివారం పూజలు నిర్వహించి ఊరేగింపు చేశారు. రామాలయం వద్ద ఉట్లు కొట్టారు.

అమరచింత : శ్రీకృష్ణ జన్మాష్టమి అమరచింతలో అంగరంగ వైభంగా నిర్వహించారు. మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ్ సంఘం కృష్ణ నగర్ యువకులు అయ్యప్ప ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోకి చేరుకుని ఉట్లు కొట్టారు.

ఆత్మకూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. యాదవ సంఘం, పట్టణ పెద్దలు భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. మూలమల్ల పాండురంగ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో యువకులు, చిన్నారులు వేసిన పలకల కోలాట కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం కేశవ స్వామి ఆలయ రహదారిపై ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. బంగారు భాస్కర్ భక్తులకు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన చేశారు. మార్కెట్ ఛైర్మన్ రహమతుల్లా, కృష్ణమూర్తి, శ్రీధర్ గౌడ్, భాస్కర్, గాయత్రి రవికుమార్ యాదవ్, తులసిరాజ్ యా దవ్ పాల్గొన్నారు.

వీపనగండ్ల / మదనాపురం : మండల కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఉట్లు కొట్టడానికి పోటీపడ్డారు. కరుణాకర్ యాదవ్, రంజిత్‌కుమార్, శశియాదవ్, సాయిల్ యాదవ్ పాల్గొన్నారు.



ఖిల్లాగణపురంలో ఉట్టి కొడుతున్న చిన్నారి



మదనాపురంలో ఉట్టి కొడుతున్న యువకుడు



ఊరేగింపులో పాల్గొన్న అమరచింత నాయకులు

ఆదర్శనీయుడు సర్వాయి పాపన్న గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

పెబ్బేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం కోసం అలుపెరుగని పోరటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నేటి తరానికి ఆదర్శనాయుడని పెబ్బేరు మండల గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మునిసిపాలిటీలోని గౌడ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌడ సంఘం ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్టమొదటి వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కీర్తించారు. అలాంటి మహనీయుడి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బి.బాల మాయదేవి ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వక్తం చేశారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్ గౌడ్, రామన్ గౌడ్, శివ శంకర్ గౌడ్, సురేందర్ గౌడ్, ఉమేష్ గౌడ్, రమేష్ గౌడ్, శ్యామ్ సుందర్ గౌడ్, రాజా గౌడ్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

వనపర్తి విద్యా విభాగం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణంలోని పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వెంకటరెడ్డి, ఎ.సాంబల మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై రాజీలేని ఉద్యమాలను నిర్వహిస్తూ... సమాజంలో ఉన్న వివక్షపై జరిగిన, జరుగుతున్న పోరాటాల్లో భాగస్వామ్యం అవుతూ వస్తుందన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను వనపర్తి జిల్లా కేంద్రంలో అక్టోబరు 28, 29, 30 తేదీల్లో నిర్వహించాలని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారం, కనీస వసతుల ఏర్పాటుకు ఉద్యమించాలన్నారు. విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.సతీష్, ఆర్.రంజిత్, సహాయ కార్యదర్శులు కే.గణేష్, కే.పవన్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల వ్యతిరేక బీజేపీని గద్దె దించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డి.బాల్‌రెడ్డి

వీపనగండ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకుండా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న బీజేపీని గద్దె దించాలని సీపీఎం మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎం.కృష్ణయ్య అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ రిజర్వేషన్లపై పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయకపోవడం బీసీలపై వ్యతిరేక భావాజాలాన్ని బహిర్గతం చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానంపై గవర్నర్ వెంటనే సంతకం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు పార్లమెంటులో నోరు మెదపకపోవడం సరికాదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళిత గిరిజన మైనార్టీ అణగారిన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. మనువాద భావాజాలంతో రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తుందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మహబూబ్‌బాషా, రవిప్రసాద్, బాలగౌడ్, కృష్ణయ్య, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఖాజా హుస్సేన్, ఈశ్వర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. ఈ నెల 25, 26న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహాసభల గోడపత్రికను ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో శనివారం విడుదల చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ... దేశానికే వెన్నెముకగా నిలిచిన రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండదండగా నిలవాల్సింది పోయి రైతుల వెన్ను విరిచే ప్రయత్నం చేస్తున్నామని విమర్శించారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ, ఎరువులు విత్తనాలు, భరోసా, బోనస్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రైతుల ఓట్లతో గద్దెనెక్కి రైతులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. అఖల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలలో జిల్లా కార్యదర్శి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు కురుమన్న, వెంకటన్న, మల్లేష్, సల్వారెడ్డి, లింగన్న, నరసింహతో పాటు పలువురు పాల్గొన్నారు.

చేనేత అవార్డు గ్రహీత దంపతులకు ఎమ్మెల్యే సన్మానం



రాములు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ వీవర్స్ కాలనీకి చెందిన సారంగి రాములుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేనేత అవార్డును ప్రకటించి అందజేసింది. ఈ సందర్భాన్ని పురష్కరించుకొని శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, రాములు దంపతులను ఇంటికి ఆహ్వానించి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ ప్రశాంత్, బోయోజ్, కృష్ణారెడ్డి, బాలనారాయణ, వెంకటనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, జేసీజీరాము, రాంమోహన్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.